మిస్ మనోజ

- వి.హెచ్.ఆర్.సుంకర



"డాడీ! నాకు ఇష్టం లేని పని మీరు చేస్తారని...నేను...కలలో కూడా ఊహించలేదు!"

అప్పటికా వాక్యాల్ని వందోసారి వింటున్న రావు గారు, ఉరఫ్ మనోజ డేడీ గారు తన ఓన్లీ డాటర్..మిస్ మనోజా రావ్ ఉక్రోషాన్ని మనసారా ఎంజాయ్ చేస్తూ...సదరు ఉక్రోషం- గత వారం ఏర్పాటు చేయబడిన 'పెళ్ళి చూపుల తంతు' వలనే ఉత్పన్నమైందని గ్రహించి-

"హండ్రెడ్" అన్నారు. అదేదో వెంకటేష్ ప్రసాద్ ఆఖరి వికెట్‌కి హండ్రెడ్ కొడితే అదిరి పోయిన అజారుద్దీన్ ఆనందంతో అరచినట్టు.

అప్పటికే కందిపోయిన మొహంతో వున్న మనోజ-

"మమ్మీ ఇలాంటి చిలిపి డాడీతో ట్వంటీ ఫైవ్ లాంగియర్స్ ఎలా మేనేజ్ చేశావో..ఐ పిటీయూ.." కంప్లెయింట్ చేసింది కాఫీ కప్పుల్తో వచ్చిన మమ్మీని చూస్తూ.

"ఆహా! దూరదర్శన్‌లో దూడల పెంపకం గురించి యాంకర్ లేడీ 'యాదవ్వ' అడిగినట్టు ఎంత చక్కగా అడిగావమ్మా? ఇప్పుడు 'బర్రెల ఓనర్ బసవక్క' లెవెల్లో తమరి మమ్మీగారైన స్వరూప రాణి గారు తమ సుదీర్ఘ ఇరవై అయిదు సంవత్సరాల అనుభవాల్ని అద్దిరిపో యేలా 'ప్రసవిస్తారు!' ఐమీన్ 'డెలివరీ ఇస్తారు' తనో కాఫీ కప్పు అందుకుంటూ చాలా సీరి యస్‌గా కామెంట్ చేశారు రావూజీ..మనోజ పితాజీ!

"మమ్మీ..నిన్ను 'బసవక్కని..' ఫక్కున నవ్వే సింది మనోజ..

"అననీ తల్లీ! అసలు తప్పంతా నాదే! పెళ్ళి చూపులనాడు - అబ్బాయి పేరు రావు..రావంటే..పాపం ఏమీ రాని- అమా యక చక్రవర్తేమో..అన్నీ నా ఇష్ట ప్రకారమే నేర్పించుకోవచ్చని..తలూపాను. అంతా తారు మారైపోయింది! జోక్ లేకుండా మాట రాదు.

ఆవకాయ లేకుండా అన్నం దిగదు. 'వాళ్ళు' ఫోన్ చేసి అరగంట అయ్యింది కదా! చస్తున్నా నంటే నమ్ము. ఏ పెళ్ళయ్యే లోగా టెన్షన్‌తో ఫిట్స్ వచ్చేలా వున్నాయి" విసుక్కుంది శ్రీమతి స్వరూపరాణి ..మాతాజీ ఆఫ్ మనోజాజీ.

పెళ్ళి అనేమాట వింటుంటే మనోజ మొహం కోపంతో మళ్ళీ ఎర్రగా మారిపోయింది.

"మమ్మీ! డోంట్ మెన్షన్ దట్ సబ్జెక్ట్ ఎగైన్. ఐ హేట్ దెమ్ లైకెనీథింగ్" అంటూ తన మొహాన్ని 'ఆర్ధర్ హెయిలీ డిటెక్టివ్'లో దాచేసుకుంది.

"మతి లేని శ్రీమతీ! అమ్మాయి 'బ్రెయిన్ తినడం' మానేసి కాస్త నన్ను నోరిప్పనిస్తే తమర్ని దూరపు బందూకులైన అడ్డాకుల అప్పయ్య గారు.. అదే– చీమ మెదడు శ్రీనివాసరావు గారు..ఫోను ద్వారా సెలవిచ్చిన మహత్తరమైన విశేషాలను విన్నవించుకుంటాను. నెంబర్ వన్ మనోజ జాతకంలో ఉద్యోగ యోగం కానీ..ఏ దేశీ యానం గానీ, భూతద్దాలతో గాలించినా కన్పించనే లేదట!

నెంబర్ టూ. వారి పుత్ర రత్నం..పూల పున్నయ్య అదే కరుణాకర్‌ది అపూర్వమైన, అనన్యమైన, అదరహో జాతకమట!

బిల్ గేట్స్ తర్వాత ఇతనే ఓ 'టోల్ గేటై' అమెరికాను ఒక పూవు పూపే అవకాశాలు.." అంటూ నాటకీయంగా వివరిస్తున్న రావు గార్ని–

"ఆ సుత్తిక ఆపండి మహాప్రభో' అన్న లెవెల్లో చూసి–

"ఇంతకీ వాళ్ళ ఉద్దేశమేమిటట?" అని ఆత్రుతగా అడిగిన తన మమ్మీ వంక కోపంగా చూస్తూ–

"మమ్మీ అంత డామేజింగ్‌గా మాట్లాడిన వాళ్ళ గురించి ఇంకేమీ అడక్కు! అంబలి తాగే అబ్బాయికి మీసాలెత్తే ఫాదర్! అసలు హోల్ ఫ్యామిలీనే జాతకాల జగ్లర్స్‌లా వున్నారు" అంటూనే మళ్ళీ మొహాన్ని ఎర్రబడేలా చేసు కుంది 'మనోజ'.

"వెల్ సెడ్ తల్లీ! అసలా జనాల చూపూ, వేషాలే అదోలా..చాల్లెండి సంబడం" దాన్నిలో అన్నింటికీ సపోర్ట్ చేస్తుంటే ఇక అయి నట్టే పెళ్ళి" రావుగారి మాటల్ని కట్ చేస్తూ మండిపోయింది శ్రీమతీజీ.

"ఏం? ఎదుక్కాకూడదట పెళ్ళి! నాలుగూ తొమ్మిదున్న నైన్త్ క్లాస్ గ్రాడ్యుయేట్‌వి ఏకే అవగా లేంది అయిదూ–ఆరూ హైట్, ఫార్టీ సెవెన్ వెయిట్, జాస్మిన్ కలర్ వైటున్న రాణీ ముఖర్జీ లాంటి 'ఎంసీయే' క్యాండిడేట్‌కి మ్యారేజీ కాదా? అమ్మాయ్..ఇక లాభం లేదు! ఎర్ర గడ్డకో చేస్తావో! వైజాగ్‌కే చేస్తావో ఫోన్.. ఏ ఇష్టం..బీ క్విక్?" రావు గారి మాటలు వింటూనే మళ్ళీ మండిపడి–

"ఔనౌను! 'పదిపప్పు'లేస్తే పాలేరే పటేలన్నట్టు ఇద్దరికీ ఇద్దరే..తానా..అంటే.." ఆమె మాటల్ని మధ్యలోనే కట్ చేస్తూ–

"ప్రపంచ తెలుగు మహాసభలన్నట్టు.." అని పూర్తి చేసి–

"శ్రీమతి గారూ! మీ వేలిడిచిన 'అడ్డాకుల బుడ్డయ్య గారు' మరో మెలిక పెట్టారు. అదేమి టంటే వాళ్ళ పుత్ర రత్నం నామధేయం 'క'తో స్టార్ట్ అవుతుందట! అందుచేత వధువు పేరు 'వ'తో స్టార్టవ్వాలని 'జాతకరత్నాలు' 'జమా యించి' చెప్పారట. కాబట్టి– అందువలన" ఆయన మాట పూర్తవ్వకుండానే అందుకుంది శ్రీమతి స్వరూపాజీ!

"నేనెప్పుడో చెప్పాను. మనోజా. గినోజాలు వద్దు. ఏ 'పార్వతో', 'పవిత్రో' పెడదామని. తమరు పడనిస్తే గదా!"

"ఔను..అప్పుడే పడనిస్తే ఏ కాలో, చెయ్యో విరక్కొట్టుకుని 'కుంటి కులాసం– ఇంటికి మోసం' అంటూ సోలో సాంగ్స్ పాడుకుం టుండే దానివి. అయినా ఎవరో అడిగారని 'అ'తో కావాలంటే 'అప్పలమ్మనీ', 'స'తోడవ్వా లంటే 'సమ్మక్క' అనీ కూతురి పేరు ఖానీ చేస్తావంటావా? సరే అదలా వుంచితే మరో 'అడ్డం'..అదేమిటంటే అత్తగారి ఆకారం..అ స్సలు నచ్చలేదట" ఆమె ఉబ్బెత్తు పొట్ట వంక చూస్తూ ఆట పట్టించారు రావు గారు.

"డాడీ! పాపం..మమ్మీనిక వదిలేయండి. బైదిబై..శుభ వార్త చెప్పినందుకు మెనీ మెనీ అండ్ సోమెనీ థ్యాంక్స్..నేను ఆరోజే చెప్పా లనుకున్నాను..పాపం మమ్మీ హర్టవుతుందేమో నని..."

ఆరోజు.. కళ్ళ ముందు...ఫ్లాష్ అవుతుంటే ఆలోచనలో పడిపోయింది మనోజ.

* * *

ఫార్మాలిటీస్ అన్నీ అయిపోయాక గళం విప్పారు పెళ్ళి కుమారుల వారి పితృదేవులైన శ్రీనివాస రావు గారు.

"రావు గారూ! మీ సంబంధం మాకు అన్ని విధాలా నచ్చింది. కాకపోతే జాతకాలు కల వాలి. మావాడి జాతకం చూపించాం. చాలా ఉచ్చ స్థితిలో వుందన్నారు. వాడి గ్రహ స్థితీ, రాసుల చలనం చాలా ఫేవరబుల్‌గా వున్నాయి. ఈ విషయాన్ని కంప్యూటర్ కూడా 'కన్‌ఫం' చేసింది. మీ మనోజ జాతకాన్ని కూడా మావాడి జాతకంతో 'మేచ్' చేయించి ఓకే అయిపోతే వెంటనే ప్రొసీడైపోదాం. నెలాఖరు కల్లా మ్యారేజీ అయిపోతే..మా వాడు ఫస్ట్‌వీక్‌లో ఫ్లైట్ ఎక్కేయాలి.."

ఆ మాటలు వింటుంటేనే కారం రాసు కున్నట్టు ఫీలైపోయింది మనోజ. మాటలే కాదు, వాళ్ళ చూపులూ, వేషాలూ కూడా నచ్చలేదు. హడావిడిగా మేకప్ వులుముకొచ్చిన జూనియర్ ఆర్టిస్టుల్లా వున్నారే తప్ప, వాళ్ళ ప్రవ ర్తనలో కొంచెం కూడా కల్చర్ కన్పించలేదు. ప్రతి విషయంలోనూ సుమన్ రాసిన 'అమెరికా అద్ రుష్టం' గుర్తుకొచ్చి పడీపడీ నవ్వాలన్పించింది మనోజకు. చదువుకూ, సంస్కారానికీ అసలు సంబంధం లేదనే విషయం స్పష్టమైపోయింది!

ఎంత దూరపు బంధువులైతే మాత్రం ఇంత డర్టీ సంబంధమా! మమ్మీకి అస్సలు సెన్స్ లేదని విచారించింది.

ఒకవేళ వాళ్ళు 'ఎస్' అన్నా తాను 'నో' అని..ఆ విషయంలో డాడీని ఒప్పించగలనని సరిపెట్టుకుంది.

మా మనోజ జాతకం కూడా బాగానే వుంది. రేపో..మాపో..అమెరికాలో జాబ్ కూడా వచ్చే స్తుంది. మా మరొక బ్రదర్ న్యూయార్క్‌లోనే సెటిలైపోయాడు. పాస్‌పోర్ట్ రెడీ" అంటూ ఇంకా మాట్లాడబోతున్న రావు గారిని కట్ చేస్తూ–

"అయ్యా! మా నమ్మకాలు మావి. రెండు జాతకాలూ కలిస్తేనే ఈ సంబంధం చేసుకునేది! ఇంతకంటే మంచి సంబంధాల్ని కూడా జాత కాలు కలవకనే యాక్సెప్ట్ చేయలేదు" అతడి పితృదేవుడు చాలా ప్రౌడ్‌గా చెప్పాడు.

అతని మాటలు వింటుంటే చేతిలో వున్న సెల్ ఫోన్ ఎత్తి చెంప పగులగొట్టాలన్పించింది కూడా. తనది 'బ్లైండ్' రోలనీ' ఆయన మమ్మీకి బంధువనీ గుర్తుకొచ్చి కోపాన్ని కంట్రోల్ చేసు కుంది. ఆ ఇంటర్వ్యూలో..అతనో కూచి' అని స్పష్టమైపోయింది. మనోజకు. ఎమ్సీయే అమ్మాయిల్ని కట్నం అడిగినా ఇవ్వడం లేదనే విషయం తెలుసుకున్నట్టుంది. ఆ విషయంలో మాత్రం చాలా 'ఆదర్శంగా' వున్నట్టు 'బిల్డప్' ఇచ్చి ఇద్దరూ ఇండియా కొచ్చినప్పుడు వుండ డానికో ఫ్లాట్, అది కూడా 'బంజారా హిల్స్' వంటి ఏరియాలో కొనిపెడితే చాలని సన్నాయి

నొక్కులు నొక్కారు.

రావు గారికీ జాతకాల జాతర అస్సలు నచ్చ లేదు. అయినా శ్రీమతి స్వరూపా రావూజీ షష్‌టింగ్'కు తట్టుకోలేక..

మనోజ జాతకాన్ని కాపీ చేయించి ఇవ్వక తప్ప లేదు. ఓ వారం రోజుల్లో మా అమూల్యమైన అభిప్రాయాల్ని ఫోన్ ద్వారా తెలియజేస్తామనీ వీరలెవెల్లో పెలవిచ్చి పెఎలవు తీసుకున్నారు. శ్రీమతి స్వరూప రాణి గారి కాలూ, వేలూ విడిచిన బంధూకు జనాలు.

"అంటే ఈ సంబంధం తప్పి పోవడం..శుభ వార్తే నన్నమాట?" పిచ్చి కోపంతో అరిచినట్టున్న మమ్మీ వాయిస్ వింటూనే– ప్రజెంట్ టెన్స్‌లోకి వచ్చేసింది మనోజ చివన్గా ఉలిక్కిపడి.

"ఎస్ మమ్మీ! ఇలాంటి సంబంధం ఎలా చేసుకుంటానమకున్నావ్? నాకు జాబ్ చేసే యోగం గానీ, అమెరికా వెళ్ళే అవకాశం గానీ లేదంటారా డర్టీ గూస్!" కోపంతో మనోజ కూడా వాయిస్ రెయిజ్ చేసి సమాధానమి చ్చింది.

"కరెక్ట్‌గా చెప్పావమ్మా! అసలా తండ్రీ కొడు కుల కాంబినేషనే కరెక్ట్‌గా లేదు. 'ఎడ్డోడు యాపారం చేస్తుంటే గుడ్డోడు క్యాష్ లెక్కబె ట్టినట్టుంది. అయినా సరే! నువ్వలా హైపిచ్‌లో అలా మాట్లాడకూడదు. 'బికాజ్' వీళ్ళంతా మమ్మీకి బంధు జనాలు కదా! పోతే జ్యోతిష 'రీడింగ్స్' ప్రకారం ఈ తొంభై తొమ్మిదిలో అబ్బాయికి 'పెళ్ళి' అసలు అచ్చిరాదనీ, అందు వల్ల లీవ్ కూడా క్యాన్సిల్ చేసుకుని ఇవ్వాళే మార్నింగ్ ఫ్లైట్‌కే అబ్బాయి అమెరికా బయలు దేరి పోయాడని కూడా సెలవిచ్చారు కాబట్టి ఈ చర్చా కార్యక్రమాన్ని ఇప్పటికి వాయిదా వేసుకుని ఇక ముందిలాంటి 'ఆలిండియా అష్టదరిద్రుల' సంబంధాల్ని ప్రపోజ్ చేయొద్దని శ్రీమతి గారికి మనవి చేసుకుంటున్నాను" తన గంభీర ఉపన్యాసాన్ని ముగించిన డాడీ గారికో షేక్ హ్యాండిచ్చింది మనోజ.

"మీకివాళ అవకాయ బంద్" అనేసింది స్వరూపరాణి తన అక్కసునంతా కక్కేస్తూ.

* * *

డైనింగ్ టేబుల్ ముందున్న ముగ్గురూ టీవీ న్యూస్ చూస్తూ ఉలిక్కి పడ్డారు.

"ముంబయ్ నుంచి న్యూయార్క్ బయ లుదేరిన 'పాన్ అమెరికా' ఫ్లైట్ సాంకేతిక లోపం వల్ల బయుదేరిన పదిహేను నిమి షాలకే కూలిపోయింది. ప్రయాణీకులంతా మరణించినట్టు ధృవీకరించారు. కడపటి వార్త లందేసరికి చనిపోయిన వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కంప్యూటర్ ఇంజనీర్లు..వారి పేర్లు..రా జీవ్ రావ్–సన్నాఫ్ వెంకయ్యనాయుడు, దినేష్ ప్రసాద్–సన్నాఫ్ రామయ్య చౌదరి, కరుణా కర్..సన్నాఫ్ శ్రీనివాసరావ్".

ఆఖరి పేరు వింటూనే "అయ్యో పాపం!" అన్నారు ముగ్గురూ. అందరి గుండెలూ బరు వెక్కిపోయాయి.

"చూశావా స్వరూపా! పెద్దల మూర్ఖత్వం పిల్లలనెలా బలి తీసుకుంటుందో? శ్రీ నివాసరావు చాదస్తం మూలంగానే! కదా! నిండు నూరేళ్ళ జీవితమిలా జ్యోతిషానికి బలై పోయింది!" అన్నారు రావు. "నిజంగానే! ఇరవై అయిదేళ్ళకే వాడి జీవితమిలా అయ్యిందే" బాధ పడిపోయింది స్వరూపరాణి.

"పెద్దవాళ్ళు మూర్ఖులైనంత మాత్రాన యువత ఇలా సొంత భావాల్ని సమాధి చేసు కుంటూ, జాతకాలకూ, రాహు కాలాలకూ తలొంచి బ్రతకాలా? అర్థం లేని అనుమానా లతో, మూఢ నమ్మకాలతో ఎంతో చిన్నదైన జీవితాన్ని ఎందుకిలా కష్టాలపాలు చేసుకుం టున్నారో ఐ పిటీ దెమ్ డాడీ!" వాపోయింది మనోజ.

* * *

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్..

డిపార్చర్ లాంజ్‌లో కూర్చున్న ముగ్గురి గుండెలూ బరువెక్కి వున్నాయి.

ప్రతి క్షణం జోవియల్ గా వుండే రావు గారి ధోరణి పూర్తిగా మారిపోయింది. చాలా సీరియస్ అయిపోయారు. మాటలే కరవైపో యాయి.

"ప్లీజ్ డాడీ! స్మైల్ డాడీ!" వందోసారి రిక్వెస్ట్ చేసింది మనోజ.

"మనోజా జాగ్రత్తమ్మా! సూట్‌కేస్ నిండా పచ్చళ్ళు పెట్టాను. అక్కడ బాబాయ్ రిసీవ్ చేసుకుంటారు. చేరగానే ఫోన్ చేయ్" కన్నీ రొత్తుకుంటూ అన్నది మనోజ మమ్మీ.

"ఇప్పుడొచ్చిన జాబ్ నచ్చకపోతే బాబాయితో చెప్పు వాడు చేస్తున్న కంపెనీలో వేకెన్సీ వస్తుం దట! అక్కడకు షిఫ్టయి పోవచ్చు" ఎలాగో నోరు విప్పారు మనోజ డాడీ.

అమ్మా నాన్నల జాగ్రత్తలు వింటుంటే మనోజ మనసు చలించిపోయింది. వాళ్ళను వదిలి వెళ్ళాలంటే మనసొప్పని మాట నిజమే అయినా, 'తాను అక్కడ జాబ్ చేయబోయేది అయిదు సంవత్సరాలే కదా! ఆ తర్వాత మళ్ళీ ఇక్క డకు, ఇలాగే, స్వదేశంలో, సొంత వారి మధ్య' అనుకుంటూ హాయిగా నిట్టూర్చింది మనోజ.

కరుణాకర్ లాంటి యువకులకు కనువిప్పు కలగాలని మనసులో కోరుకుంటుంటే–

"అమ్మాయ్! అమెరికా వెళ్ళినా..ఆవకాయని,
అదృష్టం వచ్చినా..అమ్మా నాన్నల్ని,
సంపదలొచ్చినా..స్నేహితుల్ని,
ఏ దేశమేగినా, తల్లి భారతినీ..మర్చిపోవద్దు!

డాడీ చెప్పిన మాటలు గుర్తొచ్చి గుండె పొంగి పోతుంటే తన 'హ్యాండ్ బ్యాగ్‌జీని' అందుకొని–

'అమ్మా నాన్నలకు బై..బై చెప్పి అడుగు ముందుకేసింది. లోన్లీగా అమెరికా వెళ్తున్న మిస్ మనోజ– ది ఓన్లీ డాటర్ ఆఫ్ రావూజీ అండ్ స్వరూపాజీ.